

ఉత్సాహంగా మెగా వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి-జి.మాడుగుల: జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా ఆదేశాల మేరకు మద్దిగరువులో యువహెూ మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఏఎస్పి ధీరజ్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఉచితంగా నడిపి స్తున్న బస్ ను మద్దిగరువు నుండి బోయితీలి వరకు పెంచారు. ఈ బస్‌కు ఎఎస్పి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. తదనంతరం బస్‌లో ఆయన మద్దిగరువు వరకు ప్రయాణించి, సురిమెట్ట గ్రౌండ్లో యువహెూ మెగా వాలీబాల్ టోర్నమెంట్ను ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ కు మొత్తం 59 టీమ్స్ పాల్గొనాయి, విన్నర్‌గా లింగేరిపుట్టు టీం, రన్నర్‌గా ఎగవ మండిబ టీములు నిలిచాయి.వీరికి నగదు బాహుమానంతో పాటు ట్రోఫీలు అందజేశారు.



ట్రోఫీని అందజేస్తున్న ఎఎస్‌పి

ఏజెన్సీలో సమ్మె విజయవంతం

- పలు చోట్ల ప్రజాసంఘాల నేతలు, కార్మికుల ర్యాలీ, రాస్తారోకోలు



పాడేరులో భారీ ప్రదర్శన చేపడుతున్న ప్రజా సంఘాల నేతలు



అరకులోయలో చేపడుతున్న ర్యాలీ

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

కార్మికుల, కర్షకులపై బిజెపి అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ గ్రామీణ సమ్మె అల్లూరి జిల్లాలో విజయవంతమైంది. జిల్లాలో పలు చోట్ల భారీ ర్యాలీలను ప్రజా సంఘాల నేతలు, కార్మికులు చేపట్టారు. రంపచోడవరంలో వ్యాపార సముదాయాలు, బ్యాంకులు, విద్యాసంస్థలు మూతపడ్డాయి

పాడేరు: పాడేరులో భారీ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సిఐటియు, ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘాల నాయకులు మెయిన్ రోడ్ సినిమా హాల్ మీదుగా జూనియర్ కాలేజ్ వరకు ర్యాలీ సాగింది. దేశంలో 2024 ఎన్నికల్లో మోడీ పాలనలోని కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించితేనే అందరికీ మేలు కలుగుతుందని సిఐటియు అల్లూరు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా మోసగిస్తుందన్నారు. విద్యుత్, రవాణా, బ్యాంకులు, ఎల్ఐసి తదితర సంస్థలన్నిటిని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించాలని చూస్తోందని విమర్శించారు. రైతాంగ ఉద్యమానికి తలవంచి వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసినా మరొక రూపంలో వాటిని అమలు పరుస్తుందని దుయ్యబట్టారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టిందన్నారు. జిఎస్టి పేరుతో పన్నులు పెంచిందన్నారు. ప్రత్యేక హెూదా, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయలేదన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టిందని విమర్శించారు.

ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ అమర్ మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించి పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎల్ సుందర్రావు, చిన్నారి, ఇంద్ర, ఆదివాసి ఆటో కార్మిక సంఘం యూనియన్ నాయకులు కృష్ణారావు, సంజీవరావు, ప్రసాద్, హరి పాల్గొన్నారు.


పెదబయలులో...

బొర్రాలో మోటార్ కార్మికుల ఆందోళన

అనంతగిరి: మండలంలోని బొర్రాలో మోటార్ యూనియన్ (సిఐటియు) కార్మికుల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు, సిఐటియు మండల కార్యదర్శి కిల్లో, మోస్య, బొర్రా ట్రైబల్ ట్యాక్సి మోటార్ యూనియన్ నాయకులు డుంబారి శ్యామ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మోటార్ చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ చట్టం డ్రైవర్లకు ఉరి తాడు లాంటిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జడ్పీటీసీ సభ్యులు దీసరి. గంగరాజు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన మోటార్ చట్టం రద్దు చేసే వరకూ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోమెల నాగులు, స్వామి, యామంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


అనంతగిరిలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగాజు

అరకులోయ రూరల్: అరకులోయలో కార్మికులు భారీ ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు, ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పాలనలో కార్మికులు, కర్షకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్పొరేట్ శక్తులకుకోట్ల రూపాయలు రాయితీలు ఇస్తున్నారని విమర్శించారు. రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని, స్కీం వర్కర్లు కనీస వేతనాలు రూ.26000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాది హామీ చట్టాన్ని పటిష్టంగా చేసి 200 రోజులు పని దినాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జే. భగత్ రాం,ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.నాగమ్మ, వెంకటలక్ష్మి, గణేష్ వాయుపుత్ర మోటార్ యూనియన్ అధ్యక్షులు రాజయ్య, సహదేవ్ ఆటో యూనియన్ కార్యదర్శి అర్జున్, చందర్రావు, ఐటిడిఎ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రాజు పాల్గొన్నారు.


డుంబ్రిగుడలో రాస్తారోకో

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్లకు దోచిపెడుతున్న బిజెపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి సత్యనారాయణ, భాష వాలంటీర్ల సంఘం రాష్ట్ర నాయకురాలు పి కుమారి, గిరిజనులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రం లో సీఐటీయూ కార్యాలయం నుండి కామయ్యపేట జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి తమార్బ అప్పల కొండ పడాల్ మాట్లాడుతూ, పంటలకు ఎంఎస్ స్వామి నాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, మహిళ సంఘం జిల్లా నాయలురాలు సొంటేన హైమావతి, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపుల కృష్ణారావు, నాయకులు పాంగి లింగమూర్తి, సుబ్బారావు, రవి కుమార్ పాల్గొన్నారు.

పెదబయలు: స్థానిక మోటార్ యూనియన్ నాయకుడు సమారెడ్డి పూర్ణయ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డుపై నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేఖంగా నినాదాలు చేసారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మన్న పడల్, కె.శరబన్నలు పాల్గొన్నారు.

హోరెత్తిన నిరసనలు

రంపచోడవరం: దేశవ్యాప్త గ్రామీణ బంద్ నేపథ్యంలో రంపచోడవరంలో వ్యాపార సముదాయాలు, బ్యాంకులు, విద్యాసంస్థలు మూతపడ్డాయి. ఈ సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయం నుండి ఐటీడీఏ వరకు ర్యాలీ నిర్వహించి, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంపచోడవరం జిల్లా అధ్యక్షులు ఎమ్,వాణిశ్రీ, ఉపాధ్యక్షులు కె.శాంతిరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను నిర్వీర్యం చేస్తుందని, దేశ సంపదను అంబానీ, అదాని వంటి కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా దోచిపెడుతుందని విమర్శించారు. కార్మిక, ప్రజా సంఘాల నాయకులు కె.రామలక్ష్మి, ఈ.సిరిమల్లిరెడ్డి, పి.రామకృష్ణ, ఎమ్,బాపనమ్మ, కె.మంగాయమ్మ పాల్గొన్నారు. ఎఐకెఎంఎస్, ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో వంజం జోగారావు, వేట్ల శ్రీరాములు, వేట్ల విజయ తదితరులు పాల్గొన్నారు.


మోతుగూడెంలో..

విఆర్.పురం : విఆర్.పురం మండలం రేఖపల్లి సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, రైతు, గిరిజన సంఘాలు, సిపిఎం నాయకులు సోయం చిన్నబాబు, కుంజ నాగిరెడ్డి, వడ్లది రమేష్, పంకు సత్తిబాబు, తాతబాబు, లక్ష్మణరావు, సోడి మల్లయ్య, జిహెచ్ సుబ్బారావు, పూనం ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

చింతూరు : చింతూరు సెంటర్ సిఐటియు ఆధ్వర్యాన రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్, అంగన్వాడీ, ఆశా, శానిటేషన్ వక్కర్లు పాల్గొన్నారు.

మోతుగూడెం : వై.రామవరం మండలం, డొంకరాయిలోని మార్కెట్ సెంటర్‌లో అంగన్వాడీ, ఆశా వర్కర్లు, మిడ్డేమీల్స్ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం రైతులు, కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

కూనవరం : మండలంలోని టేకులబోరు నుండి కూనవరం వరకు సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పూనెం సత్యనారాయణ, కొమరం పెంటయ్య, సిపిఎం నాయకులు పాయం సీతారామయ్య, మేకల నాగేశ్వరరావు, ప్రసన్న, సైకం లలిత, ముత్తమ్మ, రేణుక, భద్రమ్మ, జ్యోతి, మణి, అన్నపూర్ణ, లక్ష్మి, రవీంద్ర సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.


కూనవరంలో..

సీలేరు : జీకే వీధి మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యాన నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జి సత్యనారాయణ, గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు కొర్ర బాలయ్య, మురళ చంటిబాబు, సిరిబాల శోభన్‌బాబు, కొర్ర నీలకంఠం, మురళి రామారావు తదితరులు పాల్గొన్నారు.



రంపచోడవరంలో..


పాఠశాలలో స్టోర్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

టెన్త్ విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు ఫస్ట్ క్లాస్‌లో పాస్ కావాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే అన్నారు. శుక్రవారం గంగవరం మండలం వేములోవ ఆశ్రమ బాలికల పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ముందుగా పాఠశాలలోని అన్ని తరగతి గదులను, స్టోర్ రూమ్‌ను పరిశీలించడం జరిగింది. పదో తరగతి విద్యార్థులకు టీచింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధన ప్రకారం మెనూ అమలు చేయాలని, విద్యార్థులకు తాజా ఆహార పదార్థాలు పెట్టాలని ఆదేశించారు. కూరగాయలు, నిత్యవసర వస్తువులు, కోడిగుడ్లు వారానికి రెండు రోజులపాటు చికెన్ సరఫరా చేస్తున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. పిఒ వెంట సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

అంగన్వాడీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-రంపచోడవరం

డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న రెండు అంగన్వాడీ టీచర్లు, మూడు ఆయాలు, ఒకటి మినీ అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీకి శుక్రవారం రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

ఆముదల్పాడులో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి- చింతూరు

మండలంలోని పేగ గ్రామపంచాయతీ పరిధి ఆముదల్పాడు గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, పాఠశాల వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. ఆముదల్పాడు గ్రామాన్ని శుక్రవారం సిపిఎం బృందం సందర్శించి గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వెంకట్ మాట్లాడుతూ గ్రామంలో పాఠశాల లేక పిల్లలు చదువుకు దూరమవుతున్నారన్నారు. చేతి పంపు పాడైపోవడంతో నీటి సమస్యతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం, ఎమ్మెల్యే అన్ని సమస్యలను పరిష్కారం చేస్తామని స్థానిక సంస్థల ఎన్నికల్లో మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకొని, గెలిచాక ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదని విమర్శించారు. వైసీపీ ప్రజాప్రతినిధులకు గిరిజనుల సమస్యల పరిష్కారం పట్ల చిత్త శుద్ధి లేదన్నారు. మళ్లీ ఎన్నికలు వస్తున్న సమయంలో మరో నాటకంతో గ్రామాల్లోకి వస్తారని, వారిని నిలదీయాలని పిలుపు నిచ్చారు. తక్షణమే అధికారులు స్పందించి గ్రామానికి రహదారి, పాఠశాల, రేషన్ కార్డులు, నీటి సమస్యలను పరిషారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మొట్టుమ్ రాజయ్య, లెనిన్, గ్రామస్తులు కొసయ్య, భద్రయ్య, చెన్నయ్య, మల్లయ్య, అందయ్య, దేవయ్య, సంతోష్, ముఖేష, అయితయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్


మహిళల అభివృద్ధికి పలు పథకాలు అమలు

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా మహిళా సంఘాల కోసం వివిధ రకాలైన పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, స్థానిక ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం రంపచోడవరం తాసిల్దారు కార్యాలయ ప్రాంగణంలో వైయస్సార్ ఆసరా పథకం కింద చెక్కులను లబ్ధిదారులకు వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని నాలుగు విడతలుగా తొమ్మిది కోట్ల రెండు లక్షల 97 వేల పది రూపాయలు ఆసరా పథకం ద్వారా మహిళల అకౌంట్లో జమ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బంధం శ్రీదేవి, జడ్పిటిసి పండ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండ కుమారి, సర్పంచ్‌లు మంగ బొజ్జయ్య, వి.ప్రసాద్, కె.వెంకటలక్ష్మి, ఎంపీటీసీలు వి.లక్ష్మి, సాయిబాబా, నర్రి పాపారావు, కోసు రమేష్, జల్లెపల్లి రామన్న దొర, దండంగి సింహాద్రి, బి.శేఖర్, వెలుగు ఏపీడి ఎ.శ్రీనివాసరావు, ఎంపీడీవో హరికృష్ణ, ఏపీఎం అప్పారావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్


యుటిఎఫ్ నాయకునికి పాఠశాలలోనే నోటీసు ఇస్తున్న పోలీసు

యుటిఎఫ్ నాయకులకు పోలీసు నోటీసులు

ప్రజాశక్తి-కూనవరం

ఓట్ ఫర్ ఓపిఎస్ పేరుతో ఈ నెల 18న విజయవాడలో ధర్నా జరుగుతున్న నేపథ్యంలో మండలంలోని యుటిఎఫ్ నాయకులకు పోలీసులు శుక్రవారం నోటీసులు అందజేశారు. యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, పి.కన్నారావుతో పాటు పలువురికి నోలీసులు జారీ చేశారు. ప్రభుత్వ, పోలీసు చర్యలను యుటిఎఫ్ నేతలు నాగేశ్వరరావు, కన్నారావు తీవ్రంగా ఖండించారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుండి 19 తేదీ వరకు విధులు నిర్వహిస్తూనే పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నట్లు చెప్పారు. చలో విజయవాడ ధర్నాకు అనుమతి ఇవ్వనందున ధర్నాకు వెళ్తే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని చెబుతూ ముందస్తు నోటీసులు జారీ చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వ అక్రమ చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో చందనకు కాంస్య పతకం

ప్రజాశక్తి-చింతూరు

బీహార్ రాష్ట్రం పాట్నాలో ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు జరిగిన అండర్ -17 జాతీయ స్కూల్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో చింతూరు కేజీబీవీ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న గుత్తుల మధు చందన ప్రతిభ కనబర్చింది. 81 కేటగిరిలో కాంస్య పతకం సాధించింది.



కాంస్య పతకం చూపుతున్న మధు చందన

19న సిహెచ్‌డబ్ల్యుల 'చలో ఐటిడిఎ'

ముగిసిన మూడు రోజుల సామూహిక నిరాహార దీక్షలు



దీక్షలను విరమింప చేస్తున్న చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-పాడేరు: తమను ఆశా వర్కర్లుగా గుర్తించాలని ఐటీడీఎ ఎదురుగా సిహెచ్ డబ్ల్యూ లు చేపట్టిన మూడు రోజుల సామూహిక నిరాహార దీక్షలు శుక్రవారం ముగిసాయి.. ఈ నిరాహార దీక్షను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్ విరమింప చేశారు. సిహెచ్‌డబ్ల్యుల సమస్యల పరిష్కారం కోసం 19న చలో ఐటీడీఏ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు... ఐటిడిఏ సేవలు చేయించుకోవడం తప్ప, పని చేస్తుర్న సిహెచ్‌డబ్ల్యులను పట్టిచుకోలేదని మండిపడ్డారు. మూడు రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నా ఐటిడిఎ అధికారులు కనీసం స్పందించలేదని విమర్శించారు. ఈనెల 19న చలో ఐటీడీఏకు వచ్చి తమ సత్తా చూపిస్తారని చిన్నయ్య పడాల్ హెచ్చరించారు. అన్ని మండలాల నుంచి సిహెచ్‌బ్ల్యూలు కదిలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సుందర్రావు, ఆశ సిహెచ్‌డబ్ల్యూల నాయకులు మంగమ్మ, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు

ప్రజాశక్తి పాడేరు:-జిల్లాలో ఖాళీగా ఉన్న 32 అంగన్వాడి పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించగా 28 దరఖాస్తులు అందగా వారికి శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో మౌఖిక పరీక్ష నిర్వహించడం జరిగిందని పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి తెలిపారు. బుధవారం సబ్ కలెక్టర్ తన చాంబర్‌లో 28 అంగన్వాడి పోస్టులకు మౌఖిక పరీక్ష నిర్వహించి కలెక్టర్ ఆమోదం కోసం పంపినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఒక అంగన్వాడి వర్కర్, మూడు హేల్పర్ల పోస్టులకు దరఖాస్తులు రాలేదని, వాటికి తిరిగి నోటిఫికేషన్ జారీ చేయడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.ఈ మౌఖిక పరీక్షలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్. సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

ఇకెవైసి చేసుకోవాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: దేశవ్యాప్తంగా సహకార సంఘాలను కంప్యూటీకరణ చేస్తుండటంతో మండలంలోని గుంటసీమ ప్రాథమిక సహకార సంఘంలో సభ్యత్వం పొందిన సభ్యులు ఇకేవైసీ చేయించుకోవాలని ఆ సంఘం మండల చైర్మన్ జి మొద్దు కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, 1987 నుండి సభ్యత్వం కలిగిన సభ్యులు ఆధార్ కార్డ్, పాస్ ఫోటో, భూమి పట్టా, వన్ బి, అడంగల్ తో పాటు ఫోన్ నెంబర్లు బ్యాంకు అందజేయాలని ఆయన కోరారు. మరింత సమాచారం కోసం 9490670853 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఈవో జి కేశవరావు పాల్గొన్నారు.

సిఎం జగన్‌కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: డిడిఒ బాధ్యతలు అప్పగించి గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేసిన సిఎం జగన్ మోహన్ రెడ్డికి ఆ సంఘం రాష్ట్ర నాయకుడు వి.చిన్ని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రేడ్-5 కార్యదర్శులకు డిడిఒ అధికారాలను కల్పిస్తూ జిఒ నెం-11 విడుదల చేయడంతో గ్రామ పంచాయతీలు, సచివాలయాల మధ్య మరింత సమన్వయం ఏర్పడుతుందన్నారు. గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల ప్రతి సమస్యపై అత్యంత సానుకూలంగా స్పందిస్తున్న సిఎం జగన్ కు కృతజ్ఞతలు తెలిపారు.

నల్ల రిబ్బన్లు ధరించి యుటిఎఫ్ నిరసన



అనంతగిరిలో నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-అనంతగిరి:ఏపీ జెఎసి పిలుపు మేరకు మండలంలోని శుక్రవారం వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల రిబ్బన్‌లను ధరించి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి. దేవుడు, కార్యవర్గ సభ్యులు ఎస్. రాంబాబు, ఈశ్వర రావు, సింహాచలం, గంగరాజు, సుధారాణి, ఉషారాణి, ప్రధానోపాధ్యాయులు దుడ్డు స్వరూప రాణి పాల్గొన్నారు.

విఆర్.పురం :ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడ్డ రూ.25 కోట్లు తక్షణమే చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ మధ్యంతర భృతిని 30 శాతం పెంచాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు కె వెంకట్, ప్రధాన కార్యదర్శి యన్ జగదీష్, నాయకులు ఎన్.ప్రసాద్, వీరయ్య, రామకృష్ణ, అజయ్, రాము, రమేష్, శాంతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విఆర్.పురంలో నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

మహిళల ఆర్థిక ప్రగతిలో 'ముద్ర యోజన'

గీతం బిజినెస్ స్కూల్ వర్క్‌షాప్‌లో నిపుణులు



గీతం బిజినెస్ స్కూల్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న నిపుణులు

ప్రజాశక్తి మధురవాడ : మహిళల ఆర్థిక ప్రగతిలో ప్రధానమంత్రి ముద్ర యోజన పథకం అత్యంత ప్రయోజనకారిగా నిలుస్తోందని బ్యాంకింగ్ రంగ, మేనేజ్‌మెంట్ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసిఎస్ఎస్ఆర్) ప్రాజెక్టులో భాగంగా ఉత్తర కోస్తా జిల్లాలలో ముద్ర యోజన ద్వారా లబ్ధిపొందిన మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఎపి ఛాంబర్ ఆఫ్ కామర్స్ మహిళా పారిశ్రామిక వేత్తల విభాగం అధ్యక్షురాలు ఎ.లీలారాణి మాట్లాడుతూ, ముద్ర యోజన ద్వారా గ్రామీణ మహిళలకు పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశం వచ్చిందన్నారు. మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగిస్తే ఆర్థికంగా ఎదిగే సత్తా పెరుగుతుందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలలో వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో మహిళలకు పారిశ్రామికవేత్తలుగా మంచి భవిష్యత్తు ఉందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ మంజుశ్రీనాయుడు మాట్లాడుతూ ముద్ర యోజన పథకంలో 60 శాతానికి పైగా లబ్ధిదారులు మహిళలే ఉండటం ఈ పథకం ఏ మేరకు విజయం సాధించిందో తెలియజేస్తోందన్నారు.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసిఎస్-ఎస్ఆర్) ప్రాజెక్టు కోఆర్డినేటర్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాధా రఘురామ పాత్రుని మాట్లాడుతూ తమ అధ్యయన బృందం 789 మంది ముద్ర యోజన లబ్ధిదారులను కలిసి వారి ఆర్థిక స్థితిగతులపై సర్వే చేసిందన్నారు. అధిక శాతం మంది మహిళలు పథకం ద్వారా తాము స్వయం సమృద్ధి సాధించింది తెలిపారని వెల్లడించారు. కార్యక్రమంలో హైదరాబాద్ యూనివర్సిటీ ఆర్థిక శాస్త్ర విభాగం ప్రొఫెసర్ సి.వెంకటరెడ్డి పాల్గొని ఆర్థిక రంగంలో మహిళ పారిశ్రామిక వేత్తల ప్రాధాన్యతను వివరించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనయర్ మేనేజర్ కె.సత్యంనారాయణ, చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ (సిడ్బి) మేనేజర్ రోహిత్ మాట్లాడుతూ సూక్ష్మ రుణాలను గ్రామీణ, గిరిజన, పట్టణ ప్రాంత మహిళలకు అందించడంలో ముద్ర యోజన విజయవంతం అయిందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ముద్ర యోజన ఏ విధంగా ఉపయోగపడుతుందో వారు వివరించారు.

'గీతం'లో ముగిసిన ఎన్‌ఎపి వార్షిక సమావేశాలు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహించిన నేషనల్ అకాడమీ ఆఫ్ సైకాలజీ (ఎన్ఎపి) 33వ వార్షిక సమావేశాలు శుక్రవారం ముగిశాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మానసిక శాస్త్రవేత్తలు, పరిశోధకులు పలు ఆసక్తికర అంశాలను వెల్లడించారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ కామయ్య బండి, నేషనల్ అకాడమి ఆఫ్ సైకాలజీ నూతన అధ్యక్షుడు ఎన్.త్రిపాఠి, అప్లైడ్ సైకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, సమావేశాల కన్వీనర్ డాక్టర్ డి.రవిశంకర్, కోకన్వీనర్ డాక్టర్ నిధిమిశ్రా, ప్రొఫెసర్ నళిని పాల్గొన్నారు. సమావేశాలలో పాల్గొన్న ఉత్తమ పరిశోధకులకు అవార్డులను, సర్టిఫికేట్‌లను అందజేశారు. దేశంలోని ఐఐటిలు, ఐఐఎమ్‌లు, కేంద్ర పరిశోధన సంస్థల నిపుణులు మాజీ వైస్ ఛాన్సలర్‌లు, మానసిక శాస్త్రవేత్తలు 200 మందికి పైగా ఈ సమావేశాలకు హాజరయ్యారు.

జిప్ లైన్ ఏర్పాటు చట్ట విరుద్ధం

- జెడ్‌పిటిసి దీసరి గంగరాజు



జిప్‌లైన్‌ను పరిశీలిస్తున్న గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రంమైన బొర్రా పంచాయతీ బొర్రా గుహలు వద్ద గిరిజన చట్టాలను ఉల్లంఘించి నిర్మించిన జిప్ లైన్‌ను ప్రైవేట్ వ్యక్తులను ఇచ్చే ఒప్పందాలు తక్షణమే రద్దు చేయాలని సీపీఎం జెడ్పీటీసీ దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం బొర్రాలో పర్యటించిన సీపీఎం బృందం బొర్రా గుహలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ బొర్రా గుహలను ఆనుకొని గిరిజన నేతురుడు అక్రమంగా ఆక్రమించి రోఫ్ వే జిఫ్ లైన్ ఏర్పాటు చేశారని, దీంతో బొర్రా గుహలు మనుగడ దెబ్బతింటుదన్నారు. 5వ షెడ్యూల్ ఏరియాలో 1/70 చట్టాన్ని ఉల్లంఘించి గ్రామసభ అనుమతులు లేకుండా జిప్ లైన్ నిర్మించడమే కాకుండా గుహ గేటుకు ఆనుకొని ఉన్న 3 ఎకరాల భూమిని గిరిజనేతరుడికి కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. బొర్రా ముఖ ద్వారానికి ఇరువైపులా పచ్చటి వాతావరణంతో ఆక్సిజన్ అందిస్తూ అల్లాహదకారమైన వాతావరణం అందించే అడవులను ధ్వంసం చేయడానికి పూనుకొంటున్నారని విమర్శించారు..టూరిజం శాఖ అధికారులు అభివృద్ధి పేరుతో గిరిజన చట్టాలను, హక్కులను ఉల్లంఘించి అనుమతులు జారీ చేస్తే చూస్తూ ఊరుకోమని తిరుగు బాటు తప్పదని హెచ్చరించారు. జిప్ లైన్‌ను స్వాధీనం చేసి ఐటిడిఎ పరిధిలోని నడిపించాలని డిమాండ్ చేశారు.ఈ విషయంపై జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లీ సుభద్ర, జిల్లా కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, టూరిజం శాఖ అధికారులను కలిసి లిఖితపూర్వకంగా పిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టోకురు సర్పంచ్ కిల్లో, మోస్య, అనంతగిరి సిపిఎం మండల కార్యదర్శి సోమెల, నాగులు పాల్గొన్నారు

డిఎస్‌సి పేరుతో మోసం : టిడిపి



ప్రచారం చేపడుతున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి పాడేరు :- గత నాలుగేళ్ల రాష్ట్రంలో డిఎస్సీ అభ్యర్థులకు సీఎం జగన్ మొండిచేయి చూపించారని టిడిపి ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి కొట్ట గుల్లి సుబ్బారావు ధ్వజమెత్తారు. జీకే వీధి మండలం సంకాడ, దామనపల్లి పంచాయతీలో శుక్రవారం బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైయస్సార్సీపి ప్రభుత్వం వచ్చిన తర్వాత డీఎస్సీ టీచర్ల పోస్టులు 6100 నోటిఫికేషన్ జారీ చేసిందని, గిరిజనులకు ఒరిగేదేమీ లేదన్నారు. జీవో 3ని వైయస్సార్ ప్రభుత్వం అమలు చేయ లేనందున 87 టీచర్ పోస్టులు మన గిరిజనులకు దక్కలేదన్నారు.ఇటువంటి ప్రభుత్వం ఉండటం గిరిజనులకు అవసరమా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీటీసీ ఎం.లక్ష్మణరావు, ఎం.నాగేంద్ర ప్రధాన కార్యదర్శి, తెలుగు మహిళ సిహెచ్ నూక రత్నం, మాజీ మండల పార్టీ ప్రెసిడెంట్ ముక్కల మహేష్ పాల్గొన్నారు..



పిఒకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం ప్రజాప్రతినిధులు

సమస్యలపై ఐటిడిఎ పిఒకు సిపిఎం వినతి

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని సమస్యలు పరిష్కరించాలని చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్యకు సిపిఎం ప్రజాప్రతినిధులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గండి కొత్తగూడెం వెళ్లే రోడ్డును త్వరితగతిని పూర్తి చేయాలన్నారు. రేపాక కాలనీ నుండి గండి కొత్తగూడెం వరకు బిటి రోడ్డు నిర్మాణానికి, లింగాపురం -రేకులపాడు రోడ్డు మధ్య కల్వర్టు నిర్మాణానికి, కూటూరు గ్రామంలో సచివాలయ కార్యాలయం వరకు సిసి రోడ్డు, సంత షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కోరారు. దీనికి ఐటిడిఎ పిఒ స్పందిస్తూ సంబంధిత పనులు పూర్తి చేయాలని ఐటిడిఎ ఇఇకి సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సర్పంచులు మడకం నాగమణి, బొగ్గ వెంకమ్మ, సిపిఎం నాయకులు పాయం సీతారామయ్య, మేకల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా బాలు

ప్రజాశక్తి- రంపచోడవరం : అల్లూరి సీతారామరాజు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ పిఓఏ యాక్ట్ కమిటీ సభ్యునిగా హుమన్ రైట్స్ వాచ్ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు బాలు అక్కిసను జిల్లా కలెక్టర్ నిర్మించారు. ఈ మేరకు బాలు అక్కిస శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. షెడ్యూల్ కులాలు, తెగల వారి హక్కులను కాపాడి వారి హక్కులపై ప్రచారం చేసినందుకు గాను తనను నియమించడం జరిగినదని తెలిపారు. కమిటీ సభ్యునిగా నియమించినందుకు గాను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు బాలు అక్కిస కృతజ్ఞతలు తెలిపారు.

అశోక్, గోపిలను విడుదల చేయాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి అశోక్, కమిటీ సభ్యుడు ఎన్.గోపిలతో పాటు మరో ఇద్దరు ముఖ్య కార్యకర్తలను తెలంగాణ పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని, వారిని వెంటనే విడుదల చేయాలని ఏకేఎంఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహాయ కార్యదర్శి పల్లాల లచ్చిరెడ్డి, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి కే బాలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వారికి ఎటువంటి హాని కలగకుండా బేషరతుగా విడుదల చేయాలని, లేకుంటే తెలంగాణ కోర్టులో హాజరు పరచాలని కోరారు. లేనిపక్షంలో న్యాయపోరాటం చేస్తామన్నారు.

తుపాను బాధిత రైతులకు పరిహారం చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి -సీలేరు : మిచౌంగ్ తుపాన్ కారణంగా జీకే వీధి మండలంలో పంటలు నష్టపోయిన గిరి రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ గిరిజన సంఘ నాయకులు కొర్ర బాలయ్య ఆధ్వర్యాన శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ తుఫాన్ వల్ల పంట నష్టపోయి మూడు నెలలు దాటినా నేటికీ నష్టపరిహారం ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించకుంటే బాధిత గిరి రైతులను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి మురళ చంటిబాబు, నాయకులు ఎం.రామారావు పి.బాబురావు, బాధిత రైతులు పాల్గొన్నారు.

1054వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 1054వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఆనందపురం బేవరేజ్ కార్పొరేషన్ కార్మికులు చొప్పా శ్రీను, ఎన్.కనకరాజు, వి.తిలక్, డి.సాయికిరణ్ పాల్గొన్నారు.

త్వరలో బిజెపితో పొత్తు ప్రకటన

టిడిపి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బిజెపితో టిడిపి పొత్తు దాదాపుగా ఖరారైందని, వచ్చే రెండు మూడు రోజుల్లో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన అనంతరం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని టిడిపి మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గం ప్రస్తుత ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. పొత్తుల ప్రకటన అనంతరం సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ప్రకటన ఉంటుందని తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఎంవిపి.కాలనీలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 18న జరగాల్సిన నారా లోకేష్ ఉత్తర నియోజకవర్గం శంఖారావ సభ 19 ఉదయానికి మారినట్టు తెలిపారు. 18న విశాఖలో ముఖ్యమంత్రి పర్యటన ఉన్నందున, దీనిని మార్పు చేయాల్సి వచ్చిందని అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రికీ లేనటువంటి ఆంక్షలు జగన్మోహన్ రెడ్డి విశాఖపట్నం వస్తుంటే పెడుతున్నారని తెలిపారు. అమరావతిలో రైతుల వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టే చిత్రం రాజధాని ఫైల్స్ అని తెలిపారు. కోర్టు తీర్పును తాము స్వాగతిస్తున్నామని అన్నారు. వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి రాష్ట్రంలో రాజధానిపై కొత్త వాదనలకు తెరలేపారని అన్నారు. వైసిపి మునిగిపోతున్న నావ అని గంటా అన్నారు. వాలంటీర్లను రెచ్చగొట్టే వ్యాఖ్యలను సిఎం జగన్మోహన్ రెడ్డి చేయడం దారుణమన్నారు. వాలంటీర్లను తమ పార్టీ కార్యకర్తలుగా పేర్కొనడం శోచనీయమన్నారు. వైసిపి సంక్షేమ పథకాలను ఎవరూ టచ్ చేయలేరని ఆయన వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

స్వదేశీ పరిజ్ఞానంతో ముందుకెళ్తాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్వదేశీ పరిజ్ఞానంతో నావికాదళం మరింత ముందుకెళ్లనున్నట్టు తూర్పు నౌకాదళ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ తెలిపారు. భారతీయ పరిశ్రమల సహకారంతో తమ లక్ష్యాలను చేరుకుంటామన్నారు. సిఐఐ అద్వర్యంలో శుక్రవారం విశాఖలో నిర్వహించిన సిఐఐ సదరన్ రీజినల్ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆత్మనిర్భర్ ప్రయాణంలో ఎక్కువ మంది పరిశ్రమ భాగస్వాములు చేరేలా చూసేందుకు ఇండియన్ నేవీ ఇండస్ట్రీ యాత్రలను ప్రారంభించిందని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా నౌకలు, జలాంతర్గామిల రూపకల్పన, నిర్మాణ సామగ్రి, యంత్రాలు, పరికరాల విభాగాల్లో స్వదేశీ విషయాలను మెరుగుపరచడంలో భారత నౌకాదళం ముందుందన్నారు. తాము 2035 నాటికి దాదాపు 170 నౌకలు, జలాంతర్గాములను నిర్మించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం, 67 నౌకలు నిర్మాణంలో ఉన్నాయని, వాటిలో 65 భారతీయ షిప్‌యార్డుల్లోనే ఉన్నాయని వెల్లడించారు. సమావేశంలో సిఐఐ సదరన్ రీజియన్ ఛైర్మన్, వోల్వో గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కమల్ బాలి పాల్గొన్నారు.

నిరాశ్రయులను రాత్రి బసలకు తరలించండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో రోడ్లు, ఫుట్‌ఫాత్‌లు, ఫ్లై ఓవర్లు, రోడ్ల సెంటర్ మీడియన్లలో నిద్రిస్తున్న నిరాశ్రయులను జివిఎంసి నిర్వహిస్తున్న నైట్ షెల్టర్లకు తరలించేలా చర్యలు చేపట్టాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ (యుసిడి) కెవి.పాపునాయుడును ఆదేశించారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జివిఎంసి అదనపు కమిషనర్ కెఎస్.విశ్వనాథన్‌తో కలిసి నైట్ షెల్టర్ల నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో రాత్రిపూట నిరాశ్రయులు రోడ్లపైన, బహిరంగ ప్రదేశాలలో నిద్రించకుండా వారిని నైట్ షెల్టర్లకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని, అందుకు మూడు బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాత్రిపూట నిరాశ్రయులు ఎక్కడబడితే అక్కడ నిద్రించడం వల్ల పలు ప్రమాదాలు, ఇతర సంఘటనలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. సమావేశంలో భూపేష్ నగర్ నైట్ షెల్టర్ నిర్వాహకులు కొల్లి సింహాచలం, టిఎస్‌ఆర్ నైట్ షెల్టర్ నిర్వాహకులు ప్రగడ వాసు, ఇతర నైట్ షెల్టర్ నిర్వాహకులతోపాటు జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, పట్టణ ప్రణాళిక అధికారి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ సాయికాంత్ వర్మ



శిబిరంలో పాల్గొన్న సర్పంచ్ బొజ్జయ్య

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం గ్రామ సచివాలయం -2 పరిధిలోని మండల పరిషత్ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ప్రత్యేక వైద్యాధికారులు సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు, వార్డ్ సభ్యులు, గృహ సారథులు పాల్గొన్నారు.



నివాళ్లర్పిస్తున్న ఇఇ లక్ష్మీనారాయణ, సిబ్బంది

పీవీకి భారతరత్నపై హర్షం

ప్రజాశక్తి -సీలేరు : తెలుగు ప్రజల ముద్దుబిడ్డ, భారత మాజీ ప్రధానీ పీవీ నరసింహారావుకు అత్యున్నత భారతరత్న పురస్కారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల ఏపీ జెన్కో ఇఇ లక్ష్మీనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీకే వీధి మండలం సీలేరు జల విద్యుత్ కేంద్రంలో పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏపీ జెన్కో సెక్యూరిటీ సిబ్బంది ఆయనకు గౌరవ వందనం చేశారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఇఇ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలు మరువరానివన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో ఏడిఇ శ్రీకాంత్, ఏఇలు సీతారాం, రమేష్, ఏపీ జెన్కో కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

తునికాకు బోనస్ తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి- విఆర్.పురం : పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్‌ను కార్మికులకు తక్షణమే చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు డిమాండ్ చేశారు. మండలంలోని పెద్ద మంటపల్లి గ్రామంలో సిపిఎం నాయకులు వడ్లాది రమేష్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో చిన్నబాబు మాట్లాడుతూ 2012 సంవత్సరం నుండి ఇప్పటివరకు తునికాకు బోనస్ ఇవ్వలేదని, ప్రభుత్వం శాంక్షన్ చేసిన ఫారెస్ట్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. బ్యాంక్ అకౌంట్లో సరిగా లేవని కాలయాపన చేస్తున్నారని, తక్షణమే బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులు 200 రోజులకు పెంచాలని, పని ప్రదేశంలో అన్ని వసతులు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు కారం సత్తిబాబు, నాయకులు పాల్గొన్నారు.

వాలంటీర్లు సేవకులా.. వైసిపి కార్యకర్తలా ?

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సచివాలయాల వాలంటీర్లు సేవకులా లేక వైసిపి కార్యకర్తలా అన్నది రాష్ట్ర ప్రభుత్వ స్పష్టం చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.నజీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.